క్లుప్తంగా

ఆ సర్క్యులర్ రద్దు చేయాలి

మణుగూరుటౌన్: సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్లు ఇతర కార్మికులకు పసుపు, ఎరుపు రంగు బ్యాడ్జీలతో వేధింపుల సర్క్యులర్‌ను యాజమాన్యం రద్దు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విరుద్ధంగా పనిచేస్తున్నప్పుడు ప్రమాదాలు ఎదురవుతాయని, కార్మికులను బలిచేయడం సరికాదని అన్నారు. కోల్ ఇండియాలో లేని సర్క్యులర్‌లను సింగరేణిలో అవలంభించడం సబబు కాదని అన్నారు.

మాజీ ఎంపీపీ మృతి

దమ్మపేట: సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం(73), అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన దమ్మపేట మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా, ఎంపీపీగా గతంలో పనిచేశారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ పార్టీలలో పనిచేసిన ఆయన.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఇటీవలే అనారోగ్య కారణంగా, చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో, ఆదివారం ఇంటివద్దనే మృతి చెందారు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు, పలు పార్టీల రాజకీయ నాయకులు, పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: అనారోగ్యంతో మరణించిన మృతుల భౌతిక కాయాలకు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాళులర్పించారు. మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొంద్రు ప్రసాద్ మాతృమూర్తి లక్ష్మీదేవి ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే జారే, ఆమె భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్లపెంట గ్రామంలో సోయం ముత్తమ్మ మరణించగా, ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, అంకంపాలెం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొంద్రుప్రసాద్ మాతృమూర్తి లక్ష్మీదేవి భౌతిక కాయనికి మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు వేర్వేరుగా పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలువురికి పరామర్శ..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊసిర్లగూడెం, మామిళ్లవారిగూడెం గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ఇటీవలె అనారోగ్యాలతో ఆయా గ్రామాలకు చెందిన ఉమ్మల బాబురావు, వనపర్తి శ్రీనివాస్ మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, రామినేని సత్యనారాయణ, జుజ్జురపు దుర్గయ్య, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న సుమారు 80 మంది శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్‌ను టెర్మినేట్ చేసి, కొత్త కాంట్రాక్టర్‌తో జీతాలు వచ్చేదానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘం పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడి, సీఐటీయూ నాయకులు గడ్డం స్వామి, జి.లక్ష్మణ్, నాగరాజు, రమా, నరసింహారావు, రమేషు, నరేంద్ర, రమణ, మమత పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సుర్క్షా బస్టాండ్ ఆటో యూనియన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అడ్డా ఆటో యూనియన్‌లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వంక రాములు, ఉపాధ్యక్షుడిగా బత్తిని శ్రీనివాసరావు, కార్యదర్శిగా రేగళ్ల వెంకట్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఆటో యూనియన్ ఐక్యతతో పాటు తారతమ్యాలు లేకుండా బలోపేతం చేసి ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

ఇఫ్టూ నాయకుల నివాళి

మణుగూరురూరల్: ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు జెల్లా అశోక్ సోదరుడు, ప్రైవేట్ అధ్యాపకుడు జెల్లా కోటేశ్వరరావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా.. ఇఫ్టూ నాయకులు, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి వారి గృహానికి వెళ్లి జెల్లా కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు.

పరామర్శ

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన సీనియర్ అయితా రిపోర్టర్ శేషగిరిని సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ పరామార్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అలంకారప్రాయమేనా..?



ప్లాంట్‌లో అలంకారప్రాయంగా ఉన్న సామగ్రి

ప్రారంభానికి నోచుకోని వాటర్‌ప్లాంట్..

- విద్యుత్ కనెక్షన్ జాప్యంతో సమస్య
- రూ.లక్షలతో నిర్మించినా అందని తాగునీరు

అశ్వారావుపేటరూరల్: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే ఉద్దేశంతో ఐటీడీఏ ద్వారా లక్షల వ్యయంతో నిర్మించిన ఓ మినరల్ వాటర్ ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది. అశ్వారావుపేట మండలం గాండ్లగూడెం గ్రామంలో భద్రాచలం ఐటీడీఏ ద్వారా సుమారు ఆరేళ్ల క్రితం మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేశారు. వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సీసీడీపీ 2017–18 కింద రూ.6.50లక్షలు కేటాయించగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేపట్టారు. ఏళ్లుగా సాగిన ఈ ప్లాంట్ నిర్మాణం ఎట్టకేలకు పూర్తి కాగా, సురక్షితమైన తాగునీరు అందించేందుకు అంతా సిద్ధం చేశారు.

దీంతో తమకు ఇక సురక్షితమైన మినరల్ వాటర్ అందుతుందని గ్రామస్తులు భావించారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్లాంట్‌ను ప్రారంభించకుండా వదిలేయడంతో స్థానికులు మినరల్ వాటర్ కోసం పడిగాపులు కాస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ లేక..



గాండ్లగూడెంలో ఐటీడీఏ ద్వారా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్

గాండ్లగూడెం గ్రామంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తి కాగా, కేవలం విద్యుత్ కనెక్షన్ మాత్రమే ఇవ్వాల్సి ఉంది. ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది. ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం ఐటీడీఏ ద్వారా విద్యుత్ శాఖకు కొంతమేర నగదు చెల్లించాల్సి ఉంది. ఈ నగదు కుడా విద్యుత్ శాఖకు ఐటీడీఏ నుంచి చెల్లించారు. అయినా సరే విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో విద్యుత్ సౌకర్యం లేక మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించకుండా అధికారులు వదిలేశారు. ప్రస్తుతం వర్షా కాలం సీజన్ నేపథ్యంలో కలుషిత తాగునీరు వల్ల గ్రామంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, సురక్షితమైన తాగునీరును అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. వ్యాధుల బారి నుంచి కూడా కాపాడే అవకాశాలు లేకపోలేదు. దీనిపై స్థానిక ఐటీడీఏ ఏఈ ప్రసాద్‌ను 'సాక్షి 'వివరణ కోరగా.. ప్లాంట్ నిర్మాణం పూర్తైందన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో శాఖకు నిబంధనల ప్రకారం నగదు కూడా చెల్లించినట్లు చెప్పారు. దీనిపై దృష్టి పెట్టి, త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అధికారులు దృష్టి పెట్టాలి



లక్షల ఖర్చుతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తే గిరిజన ప్రజానీకానికి సురక్షిత తాగునీరు అందుతుంది. ఈ ప్లాంట్‌ను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేయడంతో స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి, ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– ఉప్పుశెట్టి ఎర్రప్ప రెడ్డి, గాండ్లగూడెం

త్వరలో కనెక్షన్ ఇస్తాం..



మినరల్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వని విషయం ఇప్పటి దాకా నా దృష్టికి రాలేదు. అన్ని వివరాలు తెలుసుకుని త్వరలోనే ప్లాంట్‌కు కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. కనెక్షన్ ఇవ్వడంలో జాప్యంపై విచారణ చేస్తాం, నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటాం.

– బి.వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏడీఈ, అశ్వారావుపేట

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



పినపాక: సింగిరెడ్డిపల్లి పంచాయతీలో కల్వర్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: వర్షాకాలం నేపథ్యంలో వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పర్యటించిన ఆయన వరదల కారణంగా దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. వరదలకు ముంపుకు గురి అయ్యే గ్రామాలు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

కరకగూడెం: సీఎం రేవంత్ రెడ్డి రాష్టంలో ప్రజారంజక పాలన అందిస్తున్నారని దేశంలో ఆదర్శ ప్రజాప్రతినిధిగా ఆయన నిలుస్తారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కలవల నాగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.అంతే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను పేద ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో ఇస్లావత్ హరికృష్ణ శ్రీదుర్గ దంపతుల నూతన గృహప్రవేశం వేడుకలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి వారికి నూతన వస్త్రాలు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బల్లలు వితరణ

ములకలపల్లి: మండల పరిధిలోని తాళ్లపాయ కనక దుర్గమ్మతల్లి ఆలయానికి విశ్రాంత ఉద్యోగి ఈడ నాగేశ్వరరావు, నాగమణి దంపతులు ఆదివారం సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. పెనుబల్లికి చెందిన నాగేశ్వరరావు స్థానిక మంగపేట పీహెచ్‌సీలో విధులు గతంలో విధులు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం లయ ప్రాంగణంలో మూడు బల్లలను ఏర్పాటు చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఆరోగ్యమిత్ర మడకం చిరుమప్ప ఉన్నారు.

మొక్కల పంపిణీ



రాచురుపల్లిలో జామాయిల్ మొక్కలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

దమ్మపేట: సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ఉప పథకం నిధులతో రైతులకు ఉచితంగా జామాయిల్, మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అటవీ విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామాంజనేయులు సహకారంతో మండలంలోని రాచూరుపల్లి గ్రామ రైతులకు ప్లాంటేషన్ నిమిత్తం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో... జామాయిల్‌ను జంట సాళ్ల పద్ధతిలో సాగుచేసి, అంతర పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము, బొబ్బర, వేరుశనగ వంటి పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఏపీఓ శంకర్, సీఓలు రమేష్, ముత్యాలరావు, శంకర్, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది సుంకర రంగారావు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆషాడ మాసం సందర్భంగా భక్తులు బోనాలతో పెద్ద ఎత్తున రాగా, అమ్మవారి ఆలయం చూట్టు ప్రదీక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్, నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, ఏవీ రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జానకీపురం గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు పిట్టల లక్ష్మయ్య మృతదేహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. అనంతరం ఆయన మాట్లాడుతూ..లక్ష్మయ్య కుటుంబానికి రూ 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన బొల్లినేని

అశ్వాపురం: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు బొల్లినేని సురేష్ చండీఘడ్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. దత్తాత్రేయను సురేష్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.

రామయ్యను దర్శించుకున్న ఏఎస్పీ



భద్రాచలంఅర్బన్: రాముల వారిని దర్శించుకున్న భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఆదివారం భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఏఎస్పీ అంకిత్ కుమార్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న భద్రుని కోవెలను,లక్ష్మీతయారమ్మ వారిని, ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తాయారమ్మ వారి సన్నిధిలో ఏఎస్పీ అంకిత్ కుమార్ కు అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. దేవస్థానం ఈవో రమాదేవి, సీఐ సంజీవరావు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారిని భద్రాచలం నూతన ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అంకిత్‌కుమార్ సంక్వార్ కుటుంబ సభ్యులతో ఆధివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నార చీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్ఠతను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ బి.అశోక్, ఎస్సై గణేష్, సిబ్బంది ఉన్నారు.

రైతుల పూజలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన రైతులు వర్షాలు కురవాలని, తుమ్మలచెరువు నిండాలని, పంటలు పండాలని కట్టమైసమ్మకు రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామపెద్దలు, రైతులు, గ్రామస్తులు డప్పు చప్పుల్లలో ఊరేగింపుగా బయలుదేరి తుమ్మలచెరువు కట్టపై కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుధీర్, గ్రామ పెద్దలు జాలె రామకృష్ణారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, పాటి మన్మథరెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అయిలయ్య, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్, పక్కన ఎస్సై రాజేందర్

కరకగూడెం: రక్తదానం మరొకరి జీవితానికి వెలుగు నివ్వడమే కాకుండా రక్తదానం ప్రాణదానంతో సమానమని కరకగూడెం ఎస్సై రాజేందర్ పేర్కొన్నారు.ఆదివారం భట్టుపల్లి జెడ్పీ పాఠశాలలో ఆ గ్రామస్తులు, పోలీస్ శాఖ, భద్రాచలం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులు, తల సేమియా, సికెల్ సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్న బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురు నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్సై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరకక ఇబ్బంది పడుతున్న తరుణంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి, అండగా నిలిచిన సుమారు 40 మంది రక్త దాతలను అభినందించారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుకు కృషి చేసి విజయవంతం చేసినందుకు నిర్వహకులు యగ్గడి భాస్కర్, ఇల్లందుల సురేష్, కొప్పుల మురళిలను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు,వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

బూర్గంపాడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవం మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవంగి రమణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు దేవంగి రామచంద్ర, రావులపల్లి ఈశ్వరయ్య,మిర్యాల ముసలయ్య, గంటా నర్సింహారావు, రాయల వెంకటేశ్వర్లు, కొమ్ము పాపయ్య, బూసిపాక జయమ్మ, కేసుపాక పుల్లయ్య, మిర్యాల నర్సింహారావు, మిర్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవం, ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంఘం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అర్ర కనకయ్య, కొమ్ము హుస్సేన్, బోయిళ్ల నరసింహరావు, ఉసికెల కొండయ్య, చెక్క రమేష్, బాబురావు, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా సుదీర్ఘ ఉద్యమాలు నిర్వస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేకల లత, సుహాసిని, అలవాల రాజ పెరియార్, ప్రభాకర్, వీరరాఘవులు, సాయి, అశోక్, వీరస్వామి, ప్రసాద్, నరేష్, వెంకటకృష్ణ, శ్రీకాంత్, పండు, శంకర్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



అశ్వారావుపేట: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జూపల్లి రమేష్



మణుగూరురూరల్: నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

చర్ల: అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న శ్రీరామల శ్రీనివాస్‌ను వేధింపులకు గురి చేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మాలమహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడెళ్ల గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం చర్లలో జరిగిన మాలమహానాడు అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి, మృతుడి కుటుంబానికి రూ.5 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకుల తడికల లాలయ్య, గౌరవ అధ్యక్షులు మోతుకూరి ప్రభాకర్‌రావు, మండల అధ్యక్షులు రుంజా రాజారావు, నాయకులు తోటమళ్ల కృష్ణారావు, సినిగిరి సుధాకర్‌రావు, కర్రి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మోతుకూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం రేగుబల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌ని కులపరమైన వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు పురిగొలిపారని అన్నారు. బాధ్యులను ఉద్యోగాల నుంచి తొలగించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, నాయకులు దామెర్ల ప్రశాంత్, పడిదల గణేష్, పున్నారావు, వేల్పుల ప్రణయ్, శ్రీకాంత్, వల్లేపోగు నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌ను వేధించి ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్ రెడ్డి, సిబ్బందిని కఠినంగా శిక్షించాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసోన్, జిల్లా నాయకుడు మేకల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు అశ్వాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇదే అంశంపై మాట్లాడుతూ.. కారకులకు శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

దుమ్ముగూడెం: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోతుకూరి శ్రీకాంత్, దళిత హిందు మాలనాడు వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు వేరువేరు సమావేశాల్లో డిమాండ్ చేశారు. బాధ్యులను ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు,నాయకులు దామెర్ల ప్రశాంత్, పడిదల గణేష్,పున్నారవు,వేల్పుల ప్రణయ్, శ్రీకాంత్, వల్లేపోగు నాగపవన్,దాసం కన్నయ్య,మోదుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మణుగూరు మండల అంబేడ్కర్ సేవా సమితి, మాల మహానాడు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సై శ్రీనివాస్‌కు నాయకులు ఘన నివాళ్లర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ యూత్ నియోజకవర్గ కార్యదర్శి పద్దంశ్రీను, యూత్ నాయకులు రంజిత్, ఏశవ్, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకునేలా చేసిన అధికారులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో పుట్టి రవి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మాల మహానాడు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో దాసరి కనకరాజు, బర్ల రామకృష్ణ, డేగల రాజు, సందీప్ ఉదయ్ కాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ బలవన్మరణం దిగ్భాంతికి గురిచేసిందని ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై మృతిపట్ల తీవ్రవిచారం వ్యక్త చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతికి తెలిపారు.

ఎమ్మెల్యే నివాళి..

అశ్వారావుపేట: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతదేహానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌బాబు నివాళులర్పించారు. ఆదివారం ఎస్సై మృతదేహాన్ని వరంగల్ జిల్లాలోని ఆయన స్వగ్రామం నారక్కపేటకు తరలించగా వీరు అక్కడకు చేరుకుని నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకురాలని నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఎస్సై కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి: మాజీ ఎమ్మెల్యే

అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.కోటి పరిహారంతోపాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సై కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, చిప్పనపల్లి బజారయ్య, మోటూరి మోహన్, దిలీప్ ఉన్నారు.